క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటెపాడు(గుంటూరు): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీ–13 ఈఈ పీహెచ్ హుస్సేన్ ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీ–13 సెక్షన్(ఆర్టీసీ కాలనీ)లోని 33/11 కేవీ ఏఎస్ కృష్ణ ఎస్ఎస్ నుంచి వచ్చే 11 కేవీ సీతారామ నగర్ ఫీడర్ మీద మెయింటెనెన్స్, చెట్ల తొలగింపు చేపట్టనున్నట్లు వివరించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ ఉండదని చెప్పారు. సీతారామనగర్ తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన



నగరంపాలెం: స్థానిక కొరిటెపాడు గాంధీ బొమ్మసెంటర్ శ్రీకోదండరామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో భాగంగా మంగళవారం సుప్రభాత సేవ, స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, అర్చన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ఆల్‌రౌండర్ రాము ఈవెంట్స్(పశ్చిమ గోదావరి) ఆధ్వర్యంలో ఇంద్రజాల ప్రదర్శన, మిమిక్రీ చేపట్టారు. నంది అవార్డు గ్రహీత, మ్యాజిక్ క్వీన్ ప్రసన్న ప్రదర్శించిన ఇంద్రజాల ప్రదర్శన ఆకట్టుకుంది. శివ, ప్రతాప్ శిష్య బృందం పాల్గొనగా, చిన్నారులను అలరించింది. ఆలయ అధ్యక్షులు కొమ్మినేని శివకోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కె.ఆదినారాయణ, కోశాధికారి కె.ప్రసాద్, సభ్యులు కె.కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, పి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జూనియర్ టైప్ రైటింగ్‌లో శ్రీజన్‌కు 3వ ర్యాంకు



గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక విద్య– శిక్షణ మండలి నిర్వహించిన జూనియర్ టైప్ రైటింగ్ టెక్నికల్ ఎగ్జామినేషన్‌లో మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి బి.శ్రీజన్ రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కేవీ సెబాస్టియన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అభినందించారు. టైపు రైటింగ్‌లో అత్యుత్తమ శిక్షణ పొందిన తమ విద్యార్థి శ్రీజన్ వందలాది మంది విద్యార్థులతో పోటీ పడి రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకుతో పాటు జిల్లాలో మొదటి స్థానంలో నిలవడం పాఠశాలకు గర్వకారణమన్నారు. పాఠశాల కరస్పాండెంట్ మంజు సెబాస్టియన్ మాట్లాడుతూ చదువుతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని అన్నారు. ముఖ్యంగా సాంకేతిక నైపుణ్యాలు ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో శ్రీరామ్, రాహి, సదాశివ టైపు ఇనిస్టిట్యూట్స్ ప్రిన్సిపాల్స్ ఎన్.అనూరాధ, ఎస్ఎస్ నాగలక్ష్మి, శ్రీనివాస్ సింగ్ పాల్గొన్నారు.

ఖాతాలో రూ.78 వేలు మాయం

లక్ష్మీపురం: బ్యాంక్ ఖాతా నుంచి హ్యాకర్ రూ.78 వేలు మాయం చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. జీటీ రోడ్డు, రిషి వ్యాలీ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే పసుపులేటి రామ్ కైలాష్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కైలాష్‌కు వన్ ప్లస్ మొబైల్‌లో రెండు సిమ్ కార్డులున్నాయి. మార్చి 29వ తేదీ ఉదయం 9 గంటల సమయంలో కైలాష్ ఫోన్‌కు కొన్ని ఓటీపీలు ఆర్‌బీఎల్ క్రెడిట్ కార్డు నుంచి వచ్చాయి. ఆ ఓటీపీలను ఎవరికి షేర్ చేయలేదు. అయితే అప్పటికే కైలాష్ ఫోన్‌ను హ్యాక్ చేసిన గుర్తు తెలియని వ్యక్తి ఫ్లిప్ కార్డు యాప్ ద్వారా రెండు సెల్‌ఫోన్‌లు, ఒక షూష్ గిఫ్ట్ కార్డ్స్‌ను ఆర్‌బీఎల్ క్రెడిట్ కార్డు ద్వారా వేరే వ్యక్తికి ఆర్డర్ చేరాయి. వారి వివరాలు ఎక్కడ అని కనుగొనే లోపే ఒక సారి రూ.57,917, రూ.18,607, రూ.3,000 కైలాష్ ఖాతా నుంచి డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. కైలాష్ వెంటనే కస్టమర్ కేర్ ఫోన్ చేసి బ్లాక్ చేయించి, 1930కి అదే సమయంలో ఫిర్యాదు చేశాడు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసిన నంబర్‌ను కూడా ఇచ్చారు. వెంటనే ఫ్లిప్ కార్డు కస్టమర్ కేర్‌కు ఫోన్ చేయగా అప్పటికే ఆర్డర్ చేసిన సెల్‌ఫోన్‌లు, షూ డెలివరి అయినట్లు చెప్పారు. హ్యాక్ చేసి ఫ్లిప్‌కార్డు ద్వారా ఆర్డర్ చేసిన వారి వారి పేరు మిరాజ్ ఖాన్ అని, సమా బిర్యానీ హౌస్, వెస్ట్ బెంగాల్ అని ఉంది. దీంతో కైలాష్ దిక్కుతోచక మంగళవారం నగరంపాలెం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సావిత్రీబాయి పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

నెహ్రూనగర్: జ్యోతిరావుపూలే విగ్రహం పక్కనే సావిత్రీబాయి పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బీసీ సంఘాల నాయకులు విన్నవించారు. ఈ మేరకు మంగళవారం నగర ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల, నగర కమిషనర్ పులి శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ కాలేజీ సెంటర్‌లో మహాత్మ జ్యోతి రావుపూలే విగ్రహం పక్కనే సావిత్రీయి పూలే విగ్రహం చేయడంతో పాటు ఐలాండ్ నిర్మించాలని కోరారు

భవన నిర్మాణాలకు గడువులోగా అనుమతులు

కమిషనర్ పులి శ్రీనివాసులు



వాకర్స్‌తో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: భవన నిర్మాణ దరఖాస్తులను పరిశీలించి నిర్దేశిత సమయంలోపు అనుమతులు మంజూరు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో పట్టణ ప్రణాళిక కార్యదర్శులు, అధికారులు, సిబ్బందితో సమావేశం మంగళవారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక కార్యదర్శుల వద్దకు వచ్చే భవన నిర్మాణ దరఖాస్తులను రెండు రోజుల్లో పరిశీలించి, తదుపరి అనుమతుల కోసం పట్టణ ప్రణాళిక అధికారుల వద్దకు పంపాలని కోరారు. అనధికార నిర్మాణాలను గుర్తిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి నోటీసులు అందజేసి వాటిని తొలగించాలన్నారు. ఈ నెల 14 లోపు నగరంలో ఉన్న అనధికార డిస్‌ప్లే బోర్డులను గుర్తించి నివేదికలను అధికారులకు అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీలు వెంకటేశ్వర రావు, రెహమాన్, టీపీఎస్‌లు, టీపీబీఓలు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియంలో ఫిర్యాదుల బాక్స్

గుంటూరు నగరపాలక సంస్థ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలని, స్టేడియంలో వాకింగ్ ట్రాక్ మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ బృందావన్‌గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియం, శ్యామలనగర్ మెయిన్‌రోడ్‌లోని స్విమ్మింగ్ పూల్‌ని పరిశీలించారు. పర్యటనలో డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, డీఈఈ మధుసూదన్ పాల్గొన్నారు.

ప్రతి రోజు 50 గృహాలను తనిఖీ చేయాలి

ఏప్రిల్ నెలాఖరులోపు 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 2 అర్ధ సంవత్సరాల మొత్తం ఆస్తి పన్నును ఏక మొత్తంగా చెల్లించే వారికి మొత్తం పన్నుపై 5 శాతం రాయితీని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని దీనిపై నగర ప్రజలకు అవగాహన కలిగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, రెవెన్యూ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు, ఆర్ఐలు, ఆర్‌ఓలతో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రతి అడ్మిన్ కార్యదర్శి వారి సచివాలయ పరిధిలో ప్రతి రోజు 50 గృహాల అసెస్‌మెంట్లను, 10 వీఎల్‌టీలను, 20 ట్యాప్ కనెక్షన్లను, 10 వాటర్ మీటర్ కనెక్షన్లను తనిఖీ చేసి ప్రతి రోజు సాయంత్రానికి రెవెన్యూ అధికారులకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ మే 15 నాటికి పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులు, డిప్యుటి కమిషనర్లు డి. శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాసరావు, టి. వెంకట కృష్ణయ్య, సెక్రటరి పి. శ్రీనివాసరావు, రెవిన్యూ అధికారులు, ఆర్.ఐ లు, అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాణ్యతలో థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ కీలకం

నెహ్రూనగర్: నగరంలో నూతన రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణం అనంతరం డ్రెయిన్ టూ డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ బృందం నగరంలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంలో తీసుకోవాల్సిన అంశాలపై ఇంజినీరింగ్ అధికారులకు అవగాహన కలిగించారు.

విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు చర్యలు

కొరిటెపాడు: విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఆ శాఖ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పాశం రామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ వినియోగదారులు ప్రస్తుతం కిలో వాట్‌కు రూ.2,200 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారికి 1 కిలో వాట్‌కు డెవలప్‌మెంట్ చార్జీలు రూ.1000, సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.200 చెల్లిస్తే సరిపోతుందని వెల్లడించారు. రెండు కిలో వాట్స్ అదనపు లోడుకు రూ.4,400 బదులుగా రూ.2,400 చెల్లిస్తే సరిపోతుందని, అలాగే నాలుగు కిలోవాట్స్ అదనపు లోడుకు క్రమబద్ధీకరించుకునేందుకు రూ.4,800 చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. గుంటూరు సర్కిల్ పరిధిలో తెనాలి, గుంటూరు డివిజన్లలోని 6.12 లక్షల గృహ వినియోగదారులందరూ ఈ అవకాశాన్ని 2025 మార్చి 1వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు వినియోగించుకోవచ్చన్నారు. గుంటూరు సర్కిల్ పరిధిలోని 6.12 లక్షల గృహ వినియోగదారులు ఈఆర్వో/సబ్ ఈఆర్వో రెవెన్యూ కౌంటర్లు, మీ సేవా కేంద్రాలు, ఏపీసీపీడీసీఎల్ వెబ్‌సైట్ www.apcpdc.comలో దరఖాస్తు చేసుకొని చార్జీలు చెల్లించి అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని 2025 జూన్ 30లోగా వినియోగించుకోవాలని కోరారు.

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

వివరాలు వెల్లడించిన డీఎస్పీ అబ్దుల్‌అజీజ్



మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్‌అజీజ్, ఎస్‌హెచ్‌ఓ వీరసోమయ్య

పట్నంబజారు: వృద్ధురాలిని హత్య చేసి, వారి కుటుంబ సభ్యులపై దాడికి తెగబడిన కేసులో ఇద్దరు ప్రధాన నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. పాతగుంటూరు పోలీసుస్టేషన్‌లో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్‌అజీజ్, పాతగుంటూరు పీఎస్ ఎస్‌హెచ్‌ఓ వై.వీరసోమయ్య వివరాలను మీడియాకు వెల్లడించారు. ఆనందపేట 2వలైను సమాధుల రోడ్డుకు చెందిన షేక్ అర్షద్, అదే ప్రాంతానికి చెందిన బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడుతూ.. ఆ అమ్మాయి నా లవర్ అని, ఆమె సోదరులు నా బావమరుదులు అని ప్రచారం చేస్తున్నాడు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న బాలిక సోదరులైన షేక్ ఫైరోజ్, షేక్ ఫయాజ్, వారి స్నేహితులు సన్నీ, ఆసిఫ్‌లు ఈ నెల 3వ తేదీ ఉదయం 4.30 గంటల సమయంలో పాన్నూరు బారాఇమాంపంజా మసీదు వద్ద టీ స్టాల్ వద్ద అర్షద్‌ను తీవ్రంగా కొట్టి, బ్లేడులతో గాయపరిచారు. అర్షద్, ఇంటికి వెళ్లి విషయాన్ని తన తల్లిదండ్రులు హసన్ అలియాస్ బాబు, తల్లి షాజహాన్‌కు చెప్పాడు. ఈ క్రమంలో వారు కొంత మందిని తీసుకుని వెళ్లి ఫైరోజ్, ఫయాజ్‌ల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులైన జాఫర్, వహీదాలను కొట్టారు. దీనితో ఫైరోజ్ తండ్రి జాఫర్ కుమారులకు సమాచారాన్ని అందించిన క్రమంలో తిరిగి నలుగురు ఫైరోజ్, ఫయాజ్, సన్నీ, ఆసిఫ్‌లు ఉదయం 5.15 గంటలకు ఆనందపేటకు వెళ్లి అర్షద్ తల్లి షాజహాన్‌ను క్రికెట్ స్టంప్స్‌తో దాడి చేసి తలపై కొట్టి తీవ్రంగా గాయపరిచారు. అనంతరం 6.30 గంటల సమయంలో అర్షద్ అమ్మమ్మ అయిన పఠాన్ ఖాజాబీ(70)ని పచ్చడి బండ, ఇనుపరాడ్లుతో దాడి చేసి కొట్టడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. తరువాత ఫైరోజ్, ఫయాజ్ వారి స్నేహితులు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న అర్షద్ తండ్రి హసన్‌ను కర్రలతో తీవ్రంగా కొట్టి గాయపరచటంతో అతను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అక్కడ నుంచి నలుగురు నిందితులు పరారయ్యారు. మృతురాలి మనవరాలు షేక్ జాస్మిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు ఫైరోజ్, ఫయాజ్‌లను మంగళవారం సాయంత్రం బుడంపాడు బైపాస్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులైన సన్నీ, ఆసిఫ్‌ల పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అరెస్ట్ చేసిన నిందితులను కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.

ఫార్మసీ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి



గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మసీ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్, ఫార్మసీ ప్రాక్టీసు విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ విద్యార్థులు తమ మెదడును పాదరసంలా, మాటలు చెరుకు రసంలా ఉండే విధంగా సాధన చేయాలని సూచించారు. ఫార్మసీ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించి, సురక్షితమైన నూతన ఔషధాలను కనిపెట్టి, తమ కుటుంబానికి, కళాశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని అన్నారు. ఈసందర్భంగా డాక్టర్ యశస్వి రమణని కళాశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీ తారామయ్య, అధ్యాపకులు డాక్టర్ కృష్ణ ప్రియాంక, డాక్టర్ షేక్ షకీల పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దు ప్రతిపాదన వెనక్కి తీసుకోవాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ తీర్మానం



లక్ష్మీపురం: రాష్ట్ర మంత్రి వర్గం ఇటీవల ఆప్కాస్ రద్దు చేయాలని ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆఫ్ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ – ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ టీచర్స్– వర్కర్స్ చైర్మన్ బి.లక్ష్మణరావు అన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జేఏసీ సెక్రటరీ జనరల్ బి.ముత్యాల రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి వర్గం ఇటీవల ఆప్కాస్ రద్దు చేయాలనే నిర్ణయం, అందుకు మంత్రివర్గ సబ్ కమిటీ ఏర్పాటు చేయడాన్ని జేఏసీ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. ఆప్కాస్ రద్దును వ్యతిరేకిస్తూ ఈనెల 27న జిల్లా సదస్సు, మే 5 కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా, మే 20వ జరుగు జాతీయ సార్వత్రిక సమ్మెలో ఉద్యోగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ విభాగాల నాయకులు శ్రీనివాసరావు, నాగునాయక్, సిహెచ్.గోపాలకృష్ణ, మరియదాసు, ప్రభుదాస్, శ్రీనివాసరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

కాసులు కురిపిస్తున్న కోళ్ల వ్యర్థాలు

ప్రజారోగ్యంతో చెలగాటం



కోళ్ల వ్యర్థాలను నిల్వ చేసిన దృశ్యం

లక్ష్మీపురం: నగరంలోని చికెన్ వ్యర్థాల దందా పెరిగింది. చెత్తలో కలిసిపోయే కోళ్ల వ్యర్థాలు కూడా కాసులు కురిపిస్తున్నాయి. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక వాహనాల ద్వారా ఈ వ్యర్థాలను సేకరించి, చేపల చెరువులకు తరలిస్తున్నారు. చికెన్ షాపుల వద్ద నెలకు రూ.10 నుంచి రూ.15 వేలు చొప్పున చెల్లిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలకు చెందిన కూటమి పార్టీకి చెందిన కొంతమంది ఫిష్ మాఫియా పట్టణంలోని, చుట్టుపక్కల గ్రామాలలో తీసుకువచ్చిన చికెన్ వేస్ట్‌ను చేపలకు వేస్తున్నారు. దీంతో దాణా ఖర్చు తగ్గుతుంది. చేపలు త్వరగా పెరుగుతాయి. దీన్ని ఆసరాగా చేసుకొని కొంత మంది వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. ధనార్జనే ధ్యేయంగా చేసుకుని ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

పర్యావరణానికి పెను ముప్పు...

చేపల చెరువుల వద్ద కోళ్ల వ్యర్థాలను నిల్వ ఉంచడం వల్ల వైరస్ విస్తరించి పరిసరాల్లో ఉన్నవారు పలు వ్యాధుల బారినపడే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 2016లో కోళ్ల వ్యర్థాలను చెరువుల్లోని చేపలకు ఆహారంగా వేయడాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు సంవత్సరాలుగా కోళ్ల వ్యర్థాల వ్యాపారం బాగా పుంజుకుంది. కొన్నిచోట్ల మూడు, నాలుగు రోజులపాటు నిల్వ ఉంచిన కోళ్ల వ్యర్థాలను తరలించే క్రమంలో వాయు కాలుష్యం వెదజల్లుతోంది. వ్యర్థాలను తీసుకెళ్లే వాహనాలు వెళ్లిన మార్గాల్లో కనీసం 10–20 నిమిషాలవరకు భరించలేని దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

ఉద్యోగుల ఆరోగ్య కేంద్రంలో సౌకర్యాల కల్పనకు కృషి

సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి



కమిషనర్ నరసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రధాన వైద్యులు

లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం ఆస్పత్రి అభివృద్ధికి సెంట్రల్ జీఎస్టీ శాఖ అండగా నిలుస్తుందని కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్(సి.జి.హెచ్.ఎస్) ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య సంరక్షణకు సి.జి.హెచ్.ఎస్ ఆసుపత్రి అందిస్తున్న సేవలు అభినందనీయమని చెప్పారు. విశ్రాంత ఉద్యోగుల ప్రయోజనాలకు స్వచ్ఛభారత్ కింద సాయం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో పేషంట్లు కూర్చునేందుకు పద్దెనిమిది కుర్చీలను సిజిహెచ్ఎస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ టీసీహెచ్ కోటేశ్వరరావుకు అందజేశారు. ప్రధాన వైద్యులు డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల నిర్వహణ ను కమిషనర్ నరసింహారెడ్డి సామాజిక బాధ్యతగా స్వీకరించడం ప్రశంసనీయమన్నారు. అనంతరం ఆసుపత్రిలోని విభాగాలను కమిషనర్ పరిశీలించి, ఉద్యోగులకు, పెన్షనర్ల కు వైద్యం అందుతున్న తీరును తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అపరిష్కృతంగా వున్న కొన్ని సమస్యలను రోగులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వీటి పరిష్కారానికి తమ శాఖ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీఎస్టీ అడిషనల్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమిషనర్లు బి.రవికుమార్, ఎం.నాగరాజు సూపరింటెండెంట్లు చిదెళ్ల ఈశ్వర రావు, గాదె శ్రీనివాసరెడ్డి, పూర్ణ సాయి, సుబ్బారావు పాల్గొన్నారు.

రౌడీ షీటర్ల కదలికలపై దృష్టి సారించండి

జిల్లా ఎస్పీ సతీష్ కుమార్



అధికారుల నుంచి వివరాలు ఆరా తీస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

లక్ష్మీపురం: రౌడీ షీటర్లు, పాత నేరస్తులు, శాంతి భద్రతలకు వివాదం కలిగించే వారి కదలికలపై పటిష్టమైన నిఘా ఉంచాలని ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వ్యాపార సముదాయాల ముగింపు వేళలు, రోడ్లపై యువకుల అనవసర సంచారం, పోలీస్ సిబ్బంది రాత్రి గస్తీ నిర్వహణ తీరు, పోలీస్ అధికారుల పర్యటనలు వంటి పలు అంశాలను పరిశీలించారు. అర్ధరాత్రి సమయాల్లో హోటళ్ల, బడ్డీకొట్టులు, చిల్లర దుకాణాలు తెరవకుండా తగిన ఉత్తర్వులు జారీ చేయాలని, పాటించని వారిపై కేసులు నమోదు చేసి, తగిన కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు. రైల్వే స్టేషన్ ఆవరణలోని రైలు కోచ్ రెస్టారెంట్ పరిశీలించి, నిర్ణీత సమయం తర్వాత తెరిచి ఉంటే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. ఆయన వెంట వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్, అరండల్ పేట సీఐ వీరాస్వామి, ఎస్ఐ కృష్ణబాజీ ఉన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు

పట్నంబజారు: ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించేందుకు అధికారులు దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. మంగళవారం ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ ట్రాఫిక్, లాలాపేట పోలీసు స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరం సెంటర్, హిందూ కళాశాల కూడలి, గాంధీపార్కు, హిమని కూల్‌డ్రింక్ సెంటర్, పండ్ల మార్కెట్, పల్నాడు బస్టాండ్, ఎత్తురోడ్డు ప్రాంతాల్లో సంబంధిత అధికారులతో కలసి కాలినడకతో తిరుగుతూ ట్రాఫిక్‌ను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఏవిధంగా ఉత్పన్నమవుతోంది, ఎవరి వల్ల వస్తుంది, ఏఏ సమయాల్లో అధికంగా ట్రాఫిక్ ఉంటుందనేది ఎస్పీ సతీష్‌కుమార్ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట ఆయా పోలీసు స్టేషన్‌ల సీఐలు శివప్రసాద్, వీరయ్యచౌదరి, ట్రాఫిక్ ఎస్ఐ విజయకుమార్‌రెడ్డి ఉన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి



సిలిండర్ ధరలను తగ్గించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

లక్ష్మీపురం: కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వం గత 11 సంవత్సరాలలో అనేకసార్లు గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం దారుణమని సీపీఐ నగర కార్యదర్శి కె.మాల్యాద్రి అన్నారు. కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో నుంచి సర్దార్ భగత్ సింగ్ విగ్రహం వరకు కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచిన వాటిని తగ్గించాలని కోరుతూ నిరసన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రూడ్ ఆయిల్ ధరలు ప్రపంచ వ్యాప్తంగా తగ్గుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం ధరలు తగ్గించకుండ అదే రేట్లు కొనసాగుతూ రావటం దుర దృష్టకరమన్నారు. గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడం అన్యాయమన్నారు. పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు ఎ.సురేష్ బాబు, చల్లా మరిదాస్, యశ్వంత్ సమితి సభ్యులు నూతలపాటి వెంకటేశ్వరరావు, దుపాటి వెంకటరత్నం, జు వలి,జంగాల చైతన్య, వి.వెంకటేశ్వరరావు, జగన్నాథం, తిరుమల, నారాయణ, వెంకటేశ్వర్లు, పోతు రెడ్డి, శ్రీను, లక్ష్మి పాల్గొన్నారు.

బాలానంద కేంద్రాల ద్వారా సమగ్ర వికాసం



పాఠశాల వార్షికోత్సవంలో రాధాకృష్ణమూర్తి, సంధ్య శ్రీ, గురుదత్

గుంటూరు ఎడ్యుకేషన్: బాలానంద కేంద్రాల ద్వారా విద్యార్థుల సమగ్ర వికాసానికి కృషి చేస్తున్నట్లు బాలానంద కేంద్ర అధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం పాతగుంటూరు బాలాజీనగర్‌లోని బాలానంద కేంద్రం పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ దాదాపు ఏడు దశాబ్దాల క్రితం అప్పటి సమాజ స్థితి గతులను అధ్యయనం చేసిన పెద్దలు విద్య పరమార్థాన్ని గుర్తించి నగరంలో ఐదు బాలానంద కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రతి ఏటా మూడు వేల మంది పైగా సాధారణ విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర వికాసానికి బాటలు వేసినట్లు చెప్పారు. చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే అవకాశం పాఠశాలల ద్వారా ఉపాధ్యాయులకే ఉంటుందని అన్నారు. తొలి గురువులుగా తల్లిదండ్రులు తమ పిల్లల ఎదుగుదలకు, వారి ఆలోచనలకు తగ్గట్టు ప్రోత్సహించాలని కోరారు. సంఘ సేవకురాలు గోవిందరాజు సంధ్య శ్రీ మాట్లాడుతూ బాలానంద కేంద్రం ద్వారా విద్యా వికాసానికి తమ తల్లిదండ్రులు ఆంధ్రరత్న మాడపాటి హనుమంతరావు, వరలక్ష్మి దంపతులు రెండు వేల గజాల స్థలాన్ని అందించారని చెప్పారు. బాలానంద కేంద్రం విద్యాసంస్థల కార్యదర్శి నడింపల్లి గురుదత్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర వికాసానికి నాణ్యమైన విద్యాబోధనతో పాటు ఆటలు, పాటలు, సాంస్కృతిక అంశాలు, కో–కరిక్యులర్ యాక్టివిటీస్ లో శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం బాల, బాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో బాలానంద కేంద్ర పాలకమండలి సభ్యులు కేఎస్సార్ కుటుంబరావు, కేతరాజు రామ్ సుభాష్, కట్టమూరి నాగరాజరావు, బండారుపల్లి శ్రీనివాసరావు, పీఎస్ మూర్తి, ప్రిన్సిపాల్ ఎ.అమృతలక్ష్మి పాల్గొన్నారు.

విదేశీ విద్యకు యూబీఐ చేయూత



కొరిటెపాడు(గుంటూరు): విదేశీ విద్యకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) చేయూతనిస్తోందని ఆ బ్యాంక్ రీజినల్ హెడ్ ఎస్.జవహర్ పేర్కొన్నారు. జీటీ రోడ్‌లోని యూబీఐ ప్రాంతీయ కార్యాలయం ఆవరణలో విదేశీ విద్యనభ్యసించదలచిన విద్యార్థులకు రుణ మంజూరు పత్రాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా యూబీ రీజినల్ హెడ్ జవహర్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విద్యార్థులకు సకాలంలో కొల్లేటరల్ అవసరం లేని విద్యా రుణాలను అందిస్తోందని, ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతూ అతి తక్కువ సమయంలో కొల్లేటరల్ అవసరం లేని రుణాలను అందించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ డెప్యూటీ రీజినల్ హెడ్స్ అశ్వర్ధనాయక్, ఎ.రాజేష్, రిటైల్ లోను పాయింట్ హెడ్ రామాంజనేయకుమార్ పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు

నగరంపాలెం: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్రమైన దర్యాప్తు చేస్తుందని ఏఐఎల్‌సీ సొసైటీ స్టీరింగ్ కమిటీ కన్వీనర్ ఫాదర్ రెవరెండ్ ఇసుకపాటి శ్యాంకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రైస్తవులు, పాస్టర్లు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. పోలీసుల దర్యాప్తు ముగిసే వరకు విశ్లేషణలు నిలిపివేయాలని కోరారు.